1న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి

ఏలూరు:మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్(ఆప్కాస్) కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల ఒకటో తేదీన జిల్లావ్యాప్తంగా జరిగే మున్సిపల్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఒక ప్రకటనలో కోరింది. సిఎం జగన్ ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, సమానపనికి సమాన వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు రేలంగి నాగరాజు, కార్యదర్శి ఎ.జాన్‌బాబు డిమాండ్ చేశారు. ఆ హామీల అమలు కోసం అనేక పర్యాయాలు ప్రభుత్వానికి, అధికారులకు వినతిపత్రాలిచ్చినప్పటికీ స్పందన లేదని, అందుకే ప్రత్యక్ష కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలు, చింతలపూడి నగర పంచాయతీల ముట్టడి పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఉధృతంగా గోదావరి

పోలవరం వద్ద 26.017 మీటర్ల నీటిమట్టం - ప్రాజెక్టు నుండి 13.80 లక్షల క్యూసెక్కులు విడుదల - ముంపు మండలాల్లో తగ్గని వరద

ప్రజాశక్తి - కుక్కునూరు

ముంపు మండలాల్లో ఐదు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం భద్రాచలంలో 55 అడుగులకు ఉన్న గోదావరి సాయంత్రానికి 51 అడుగులకు చేరి నిదానంగా తగ్గడంతో మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఇప్పటికీ మండలంలోని వింజరం, ముత్యాలంపాడు, కుక్కునూరు, దాచారం, సీతారామనగరం, శ్రీధర గ్రామాల మధ్య కాజ్‌వేలను వరద ముంచెత్తడంతో 13 రోజులుగా 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద పెరగడంతో వీరవల్లి - వింజరం, బూర్గంపాడు- వేలేరు మధ్య ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఐదు రోజులుగా తిరగకపోవడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలు, వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము చెందిన 203 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్నాయి. ఆదివారం ఉదయం బెస్తగూడెం ఎస్‌సి కాలనీలోకి వరద చేరుతుండటంతో బెస్తగూడెంకి చెందిన 150 కుటుంబాలు రావికుంట కాలనీకి వెళ్లాయి. కుక్కునూరు 'ఏ' బ్లాక్‌లోని 400 కుటుంబాలు కివ్వాక, ఎల్లప్పగూడెంలోని 55 కుటుంబాలు మర్రిపాడు పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్నారు. భద్రాచలంలో వరద తగ్గుముఖం పట్టినా కాపర్ డ్యామ్ ప్రభావం, శబరి నదికి భారీగా వరద నీరు చేరి పోటెత్తడంతో తగ్గలేదు. మండలంలోని రహదారులపై నీరు తగ్గలేదు. మండలంలోని రజక బజార్, సినిమా హాలు సెంటర్, మసీద్ కాలనీలు ముంపులోనే ఉన్నాయి.

పోలవరం వద్ద గోదావరి ఉధృతి

ముంపులో ఉన్న కుక్కునూరు మసీదు కాలనీ

గొమ్ముగూడెం వరద బాధితులున్న రావికుంట పునరావాస కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రోడ్డు లేక రాత్రి సమయంలో విషసర్పాల తిరుగుతుండటంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రెండు రోజులు మాత్రమే భోజనంపెట్టారని, ఆదివారం భోజనం పెట్టలేదని, ప్రతిఏడాది తమ గ్రామాన్ని వరదలు ముంచెత్తుతున్నాయని, ఈ బాధలు పడలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం:పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 13,80,216 క్యూసెక్కుల అదనపు జలాలను ఆదివారం దిగువ విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. ప్రాజెక్ట్ స్పిల్ వే ఎగువన 34.280 మీటర్ల నీటిమట్టం, స్పిల్ వే దిగువన 26.220 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం వద్ద 35.460 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం వద్ద 25.480 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 26.017 మీటర్లకు పెరిగింది. దీంతో పోలవరం ప్రాజెక్టుకు రాకపోకలు సాగించే కడెమ్మ వంతెన, పోలవరం ప్రాజెక్టు పోలీస్ చెక్‌పోస్టు నీట మునిగాయి. పోలవరం ప్రాజెక్టుకు రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. పోలవరం ప్రాజెక్టు అధికారులు, కార్మికులు కడెమ్మ అవుట్ ఫాల్ స్లూయిస్ మీదుగా ప్రాజెక్టుకు రాకపోకలు సాగిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి డాక్టర్ ఎవిఆర్.మోహన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి డాక్టర్ ఎవిఆర్.మోహన్ తెలిపారు. జిల్లాలో ఎన్ని ఏరియా ఆసుపత్రులున్నాయి, ఎలాంటి సేవలు అందుతున్నాయి, వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారా, వైద్యుల కొరత ఉందా? వంటి పలు ప్రశ్నలకు ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో సమాధానాలిచ్చారు.

ప్రశ్న : జిల్లాలో మీ పరిధిలో ఎన్ని ఆసుపత్రులున్నాయి? వైద్యసేవలు ఎలా అందుతున్నాయి?

జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి ఏరియా ఆసుపత్రులతోపాటు భీమడోలు, దెందులూరు, కైకలూరు, పోలవరం, బుట్టాయగూడెం కమ్యూనిటీ ఆసుపత్రులు నా పరిధిలో ఉన్నాయి. ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు తప్పితే మిగిలిన అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేసేందుకు ల్యాబ్ సౌకర్యాలు ఎక్కడెక్కడున్నాయి?

అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ల్యాబ్ సౌకర్యాలున్నాయి. రక్త పరీక్షలతో పాటు అన్ని రకాల పరీక్షలు జరుగుతున్నాయి.

ప్రశ్న : సిటీ, ఎంఆర్‌ఐ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కాన్ సౌకర్యాలు జిల్లాలో ఎక్కడెక్కడున్నాయి?

అల్ట్రా సౌండ్ స్కాన్ అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ఉన్నాయి. సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్‌లు అవసరమైతే ఏలూరు మెడికల్ కాలేజీకి రిఫర్ చేస్తారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మూడు రకాల స్కానింగ్‌లు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : జిల్లాలో ఎక్కడెక్కడ డయాలసిస్ సెంటర్లున్నాయి?

జిల్లాలో ఒక్క జంగారెడ్డిగూడెంలో మాత్రమే డయాలసిస్ సెంటర్ ఉంది. ఏలూరు మెడికల్ కాలేజీలో ఉన్నప్పటికీ అది నా పరిధిలోకి రాదు.

ప్రశ్న : జిల్లాలో ఇప్పటికీ ప్రసవాలకు, ఇతర గైనకాలజీ సమస్యలకు ఏలూరు జిల్లా నుంచే కాకుండా పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా ఏలూరు వస్తున్నారు. జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో గైనకాలజీ నిపుణులున్నారా?

జంగారెడ్డిగూడెం, నూజివీడు ఏరియా ఆసుపత్రుల్లో గైనకాలజిస్ట్‌లున్నారు. చింతలపూడి నుంచి ఇటీవల బదిలీపై వెళ్లడంతో గైనకాలజిస్ట్ రావాల్సి ఉంది. త్వరలోనే భర్తీ చేస్తారు. గైనకాలజిస్ట్‌లున్నప్పటికీ అత్యవసర కేసులను ఏలూరు రిఫర్ చేస్తారు.

ప్రశ్న : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు నిర్ధారించేందుకు లేబొరేటరీ సౌకర్యాలున్నాయా?

జిల్లాలో అన్నిచోట్లా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేసేందుకు ర్యాపిడ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అలాగే నూజివీడు, జంగారెడ్డిగూడెంలో కన్వర్షన్ కేంద్రాలున్నాయి. అన్ని రకాల మందులు, ఫ్లూయిడ్స్, పడకలు సిద్ధంగా ఉన్నాయి.

ప్రశ్న : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి సేవలందిస్తున్నారు, రోగుల పరిస్థితి, అత్యవసర సమయంలో అవసరమైన మందులు, పడకలు అందుబాటులో ఉన్నాయా?

వరద ప్రాంతాల నుంచి ఇప్పటికే ప్రసవానికి దగ్గరగా ఉన్న తొమ్మిది మంది గర్భిణులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించాం. అలాగే ఒక డయాలసిస్ రోగి వరదల్లో చిక్కుకుంటే రక్షించి జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించాం. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం ఆసుపత్రుల్లో పడకలు, మందులు సిద్ధంగా ఉంచాం. మెడికల్ క్యాంపులు డిఎంహెచ్‌ఒ ఆధ్వర్యంలో నిర్వహించాం.

ప్రశ్న : ప్రస్తుతం కళ్ల కలకలు విజృంభిస్తున్న నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు? చికిత్సలు అందుబాటులో ఉన్నాయా?

కళ్ల కలకలు ఎదుర్కొనేందుకు మందులు సిద్ధంగా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో కంటి వైద్యులు అందుబాటులో ఉన్నారు.

ప్రశ్న : వైద్య సిబ్బంది అన్నిచోట్లా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నారా? ఇంకా రిక్రూట్‌మెంట్ చేపట్టే అవకాశం ఏమైనా ఉందా?

అన్నిచోట్లా జనరల్ ఫిజీషియన్లు ఉన్నారు. పోలవరం, బుట్టాయగూడెం, దెందులూరు, నూజివీడులో చిన్నపిల్లల వైద్యనిపుణులున్నారు. చింతలపూడి నుంచి ఇటీవల జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్ బదిలీపై వెళ్లడంతో వాటిని భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. త్వరలోనే భర్తీ చేస్తారు. ఇటీవల సిబ్బంది నియామకాలు పూర్తయ్యాయి. అన్ని ఆసుపత్రుల్లో పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నారు. సిబ్బంది కొరత లేదు.

నిర్వాసితుల గోడుపట్టని ప్రభుత్వాలు

పునరావాస పరిహారం చెల్లించాలి
వరద బాధితులను ఆదుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి రవి
ముంపు ప్రాంతాల్లో పార్టీ జిల్లా బృందం పర్యటన

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రతి ఏడాదీ వచ్చే గోదావరి వరదల్లో ముంపు మండలాలను ముంచుతూ అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు కాలం గడుపుతున్నారు తప్ప వారికి ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఆదివారం గోదావరి వరదలు మండలాన్ని ముంచెత్తడంతో గ్రామాలను ఖాళీ చేసి రావికుంట పునరావాస కాలనీలో ఉంటున్న గొమ్ముగూడెం, బెస్తగూడెం ఎస్‌సి కాలనీ, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామాలకు చెందిన వరద కుటుంబాలుంటున్న కాలనీల్లో పర్యటించి వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరదల వల్ల ఏయేటికాయేడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు లేక మహిళలు, ఆడపిల్లల ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నాళ్లిలా బతకాలని సిపిఎం బృందం ముందు వరద బాధితులు తమ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ ఏడేళ్లుగా అదిగో పరిహారం ఇదిగో పరిహారం అంటూ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేస్తున్నారు తప్ప నిర్వాసితులకు పరిహారం మాత్రం ఇవ్వడం లేదని, వారికివాల్సిన పరిహారం ఇచ్చి ఇక్కడి నుండి తరలిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని, ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోకుండా అనాలోచిత నిర్ణయాల వల్లే ముంపు మండలాల్లో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. తక్షణం నిర్వాసితులకు పూర్తిపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణం వరద బాధిత కుటుంబాలకు ఇక్కడ ఉన్నంతకాలం వారికి భోజన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు ఇవ్వాలని, కాలనీల్లో తాగునీరు, విద్యుత్, వైద్యం, పారిశుధ్యం, మరుగుదొడ్లు, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని, వరదల వల్ల నష్టపోయిన బాధితులకు పరిహారం, ఇంటి నష్టం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించి నిర్వా సితులకు న్యాయం చేయాలని కోరుతూ వరద బాధితులతో కలిసి రహదారిపై నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, తెల్లం రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు దుర్గారావు, వై.నాగేంద్రరావు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ముంపులో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 72 షెడ్యూల్డు రంగాలకు సంబంధించిన వేతన సవరణ వెంటనే చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉంగుటూరులో జరిగిన సిఐటియు జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగింది. డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగులను, అసంఘటితరంగ కార్మికులను, స్కీం వర్కర్లను, సమన్వయం చేస్తూ కార్మికవర్గాన్ని ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022ను, కార్మిక వర్గం అంతా అడ్డుకోవాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆశా, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన పథకం, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో బిల్డింగ్ వర్కర్లకు ఉన్న వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పారిశుధ్య కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న వారిని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ పేరిట ఉన్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న వలస కార్మికులకు రక్షణ కల్పించాలని, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు, రైల్వే ప్రయివేటీకరణను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. సిఎం జగన్ తన సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రానికి రావాల్సిన రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, ప్రత్యేక హోదా వంటి ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వానికి తాకట్టుపెట్టారని విమర్శించారు. కార్మికవర్గం ఎన్నో పోరాటాలతో సాధించుకున్న చట్టాలను కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు బానిసలుగా మారుస్తోందని, దీన్ని కార్మిక, ఉద్యోగ, శ్రామికవర్గం అంతా కలిసికట్టుగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గ ప్రయోజనాలే ప్రాధాన్యతగా సిఐటియు ముందుకెళ తుందని, సమరశీల పోరాటాలకు కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ నాయకులు కె.విజయలక్ష్మి, ఎం.నాగమణి, ఎస్‌కె.సుభాషిణి, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, కె.వెంకట్రావు, ఎస్.రాంబాబు, కెవికెఎస్.ప్రసాద్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి నాయకత్వం వహించారు.

మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

దాడికి కారకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ఏలూరు:దళిత యువకుడిపై దాడిచేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో దళిత యువకుడు మనేల్లి దుర్గాప్రసాద్‌ని ఈనెల 25వ తేదీ రాత్రి ఊరిశివారులోని ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకెళ్లి నాటు కోళ్లు అపహరించాడనే కారణంతో ఆధిపత్య కులానికి చెందిన ధర్మరాజు, బన్ను దుర్గారావు, జి.శేఖర్, సిద్దిరాజు అత్యంత దుర్మార్గంగా మర్మంగాలపై కొట్టడంతో పాటు, శరీరమంతా కర్రలతో విచక్షణారహితంగా కొట్టడం అన్యాయమన్నారు. దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ ఇప్పటివరకూ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వాళ్లకు ధైర్యం చెప్పకపోవడం చాలా బాధాకరమన్నారు. పోలీసులు సమగ్ర విచారణ చేయాలని, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

మణిపూర్‌లో అరాచకాలు ఆపడంలో బిజెపి విఫలం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మణిపూర్‌లో మతోన్మాదుల అరాచకాలను, అకృత్యాలను అరికట్టాలని రైతుసంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రామన్నపాలెంలో రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని, వీటిని తక్షణం ఆపి అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడికి పాల్పడి హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని, అక్కడి ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇది బిజెపి వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. మణిపూర్‌లో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ముంగమూరి ప్రభాకర్, యలమాటి నరసింహారావు, జగపతిరావు, వెంకటేశ్వరరావు గుండె దుర్గారావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిరసన

మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలని కోరుతూ కామయ్యాపాలెంలో ఐక్య క్రైస్తవ సంఘాల అధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ సంఘాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హింసాత్మక ఘటనలో చనిపోయిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుని వారికి నష్ట పరిహారమివ్వాలని కోరారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సందా ప్రసాద్, ప్రతాప్ రెడ్డి, నక్కా శ్రీనివాస్, ఎస్.శ్రావణ్‌కుమార్,, ఎస్.ఐజయ్య, కె.ప్రసాద్, పుల్లారావు, చందా దుర్గారావు పాల్గొన్నారు.

పోలవరం : మణిపూర్‌లో అరాచకాలను అదుపు చేయాలని మండల పాస్టర్లు, క్రైస్తవ సమాజాలు డిమాండ్ చేశాయి. ఆదివారం పోలవరంలో మండల పాస్టర్ల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు సుధాకర్, డేవిడ్ రాజు మాట్లాడారు. ఈ ర్యాలీలో పాస్టర్లు బి.జయరాజు, డి.ఇమ్మానియేలు, క్రిష్టాపర్, రొక్కల మెసేక్, 50 క్రైస్తవ సంఘాలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సోదరులు

ముంపు ప్రాంతాల్లో సబ్‌కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - వేలేరుపాడు

గోదావరి వరద ముంపులో ఉన్న మండలంలోని రుద్రంకోట గుట్టలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న పునరావాస కార్యక్రమాలను పరిశీలించారు. వరదల కారణంగా సురక్షిత ప్రాంతాలకు రాలేని వారు గుట్టలపైనే ఉంటున్నారని, వారికి సహాయక కార్యక్రమాలను వారి వద్దకే అందిస్తున్నామని సబ్ కలెక్టర్ చెప్పారు. వరద నీరు కారణంగా రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు బోట్‌ల ద్వారా అధికారులు రోజుకు రెండుసార్లు వెళ్లి అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలను కూడా బోట్‌ల ద్వారా అందిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో విఆర్‌ఒ, ఎఎన్‌ఎం, రెండు సచివాయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజలు తమ సమస్యలను కంట్రోల్ రూముకు తెలియజేస్తున్నారని, వాటిని రెవెన్యూ సిబ్బంది పరిష్కరిస్తున్నారని చెప్పారు. కొండ ప్రాంతాల్లోని ప్రజలు కొవ్వొత్తులు, దోమతెరలు కోరారని, వాటిని కూడా వారికి అందిస్తున్నామని సబ్‌కలెక్టర్ తెలిపారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక అంబులెన్సు, బోట్‌ను, జనరేటర్ అందుబాటులో ఉంచామన్నారు. వేలేరుపాడు మండలంలోని 35 నివాసిత ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. రోయిదాలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన సందర్శించి, అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, మందుల నిల్వలను తనిఖీచేశారు. అనంతరం మండలంలోని తిరుమలాపురం, పడమటమెట్ట, తూర్పుమెట్ట, కొత్తూరు, కన్నయ్యగుట్ట, తదితర గ్రామాల్లో పర్యటించారు. సబ్ కలెక్టర్ వెంట చల్లన్న దొర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపులో 45 ఆవాసాలు

13,764 మంది వరద బాధితులు
బియ్యం, కూరగాయలు, వంటనూనె పంపిణీ
కొండ గుట్టలపైన ఉన్నవారికి సహాయక చర్యలు
విలేకరుల జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరదకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 45 నివాసిత ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయని, 4,779 కుటుంబాలకు చెందిన 13,764 మంది వరదబారిన పడ్డారని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆదివారం మీడియా సమావేశంలో వరద పరిస్థితి, సహాయక చర్యలపై జెసి మాట్లాడారు. భద్రాచలంలో వరద ప్రవాహం ప్రస్తుతం తగ్గుముఖం పట్టి రెండో ప్రమాద హెచ్చరికలో ఉందన్నారు. వరదలకు వేలేరుపాడులో 35, కుక్కునూరులో పది నివాసిత ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. రెండు మండలాల్లో 12 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 4,275 మందికి పునరావాసం కల్పించామన్నారు. మిగిలిన 9,489 మంది బంధువుల ఇళ్లకు కొంతమంది, మరికొంతమంది కొండలు, గుట్టలపైకి వెళ్లారన్నారు. ప్రతిఒక్కరికీ ఆహారం, తాగునీరు, శానిటేషన్ వంటి సదుపాయాలు సమకూర్చామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 36 మెడికల్ క్యాంపుల ద్వారా 464 మందికి వైద్య సదుపాయం కల్పించామన్నారు. 119 మంది గర్భిణులను గుర్తించామని, వారిలో నాలుగు వారాల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్నవారిలో తొమ్మిది మందిని సమీప సిహెచ్‌సికి తరలించామని చెప్పారు. మిగిలిన 110 మందిని వారి సమీప బంధువుల ఇంటిలో, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉంచారన్నారు. రైస్ డిపోల ద్వారా మూడు నెలలకు సరిపడు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామన్నారు. వరద సహాయక చర్యల్లో భాగంగా రెండు పెద్ద బోట్లను, దేశీయ బోట్లను, తొమ్మిది మోటార్ బోట్లతో పాటు రెండు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం, ఫైర్ సర్వీస్‌కు చెందిన రెండు రెస్క్యూ బోట్లను సిద్ధం చేశామన్నారు. అత్యవసర పరిస్థితిలో వినియోగానికి పది జెనరేటర్‌లు సిద్ధం చేశామన్నారు. 11 లక్షల 69 వేల వాటర్ ప్యాకెట్‌లను పంపిణీ చేశామన్నారు. రేషన్ బియ్యంతో పాటు సిఎం జగన్ ఆదేశాల మేరకు మరో 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, ఆయిల్‌పామ్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. వరద సహాయక చర్యల కోసం సబ్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, ఆర్‌డిఒలు, జెడ్పి సిఇఒ, డిఆర్‌డిఎ పీడీ, డ్వామా పీడీ, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులను నియమించామన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది రాత్రిసమయంలోనూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు.



మాట్లాడుతున్న జెసి లావణ్యవేణి

దెబ్బతిన్న కచ్చా, పూరి గుడిసెలకు రూ.పదివేలు సాయం

వరదలకు దెబ్బతిన్న కచ్చా, పూరిగుడిసెలకు సిఎం జగన్ ఆదేశాల ప్రకారం రూ.పదివేలు చొప్పున అందిస్తామని, వరద తగ్గిన వెంటనే మండల స్థాయి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో విఆర్‌ఒ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో కూడిన బృందం ఇంటింటి సర్వే చేస్తారన్నారు. పునరావాస కేంద్రం నుండి బాధితులు తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ప్రతీ కుటుంబానికి రూ.రెండు వేలు చొప్పున అందిస్తామన్నారు. ఇందుకు గ్రామసభలు ఏర్పాటు చేసి బాధితుల పేర్లు వెల్లడించి పారదర్శకంగా అందిస్తామని చెప్పారు. వేలేరుపాడుకు చెందిన 19 నివాసిత ప్రాంతాల వారు, కొండ ప్రాంతాల్లో ఉన్నారని వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. జనరేటర్‌లు కూడా ఏర్పాటు చేశామన్నారు. టార్పాలిన్లు కూడా అందిస్తున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి భోజన సౌకర్యం కల్పిస్తున్నామని, అయితే కొంతమంది బయటకు వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారని, అలాంటి వారు తమకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందిస్తే వండుకుంటామని కోరారని, ఆ మేరకు వారికి కూడా అందించామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్‌తో లాభాలు

నూజివీడు రూరల్: పట్టణంలోని మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ వల్ల లబ్ధిదారులకు మంచి లాభాలు వస్తాయని డాక్టర్ వైఎస్ఆర్ క్రాంతి పథకం ఏలూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విజయ కుమారి తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ మార్కెట్లో మామిడి ధరల కంటే ఎక్కువ రేటు ఇస్తూ, ప్రాసెసింగ్ చేయడం ద్వారా ఎగుమతికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని అన్నారు.

ఆనంద నిలయానికి సహకరించండి

ఉంగుటూరు: మానవత సంస్థ ఉంగుటూరు మండల శాఖకు అనుబంధంగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమం ఆనంద నిలయానికి అందరూ సహకరించాలని ఛైర్మన్ గన్నం బుల్లబ్బాయి మానవతా సమావేశంలో కోరారు. ఆదివారం గోపీనాథపట్నంలో నిర్వహించిన మండల శాఖ నెలవారీ సమావేశానికి గంజి రవి కుమార్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉంగుటూరు మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షులు విష్ణుమూర్తి మాట్లాడారు. రిటైర్డ్ ఛైర్మన్ పుష్పాల గోపీ మాట్లాడుతూ మండల శాఖలో 500 మంది సభ్యుల్ని ఆగస్టు 15 లోపు చేర్పటానికి అంతా కృషి చేయాలన్నారు. సమావేశంలో సాగిరాజు జానకి రామరాజు, కర్పూర్బర పిల్లా రామకృష్ణ, కొండిశ్రీ సర్వేశ్వరరావు, బొమ్మిడి అప్పారావు, శీతాల సత్యనారాయణ, దొంతల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న ఏడిఏ

నీట మునిగిన పొలాలు పరిశీలన

పెదపాడు: మండల వ్యవసాయాధికారి ఏడిఏ సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి, ఏఈఓలు వీరభద్రాపురం, సత్యవోలు గ్రామంలో పర్యటించి నీట మునిగిన పొలాలను పరిశీలించారు. నీట నుంచి బయట పడిన పొలాలలో బూస్టర్ డోస్ కింద యూరియా 20 కేజీలు, పొటాష్ 15 కేజీలు చొప్పున వేసుకోవాలని, 19:19:19 ఎకరాకు కేజీ చొప్పున స్ప్రే చేసుకోవాలని తెలియజేశారు. ముంపుకు గురైన డ్రెయిన్ల వివరాలను డ్రెయిన్ డిపార్ట్‌మెంట్, కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని ఏడిఏ రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్టు

క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ఉంగుటూరు: యువత చెడు మార్గాలవైపు వెళ్లకుండా శారీరక, మానసిక ఉల్లాసానికి వారం రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ సోదరుడు పుప్పాల కార్తీక్ అన్నారు. కొత్త ఉంగుటూరులో గత వారం రోజుల నుంచి పుప్పాల కార్తీక్ పర్యవేక్షణలో బంకు శ్రీను, అడపా శ్రీను, సీపాని బాలు, పైడి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మండలం నలు మూలల నుంచి 25 టీమ్‌లు ఈపోటీల్లో పాల్గొన్నాయి. టోర్నీ విజేతగా గెలుపొందిన జట్టుకు ఉంగుటూరు మండల ఐస్ ఫ్యాక్టరీ అసోసియేషన్, సమతా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అధ్యక్షుడు పొత్తూరి శ్రీనివాసరాజు సహకారంతో రూ.20వేల నగదు బహుమతి, ట్రోఫీని అందించారు. రన్నర్‌గా నిలిచిన జట్టుకు పోటీల నిర్వాహక కమిటీ సభ్యులు సమిష్టిగా రూ.15 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. నారాయణపురం ఉపసర్పంచి అడపా శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు అరివెల్లి మహాలక్ష్మి, బండారు నాగరాజు, పైడి అరుణ్‌కుమార్, మతుకుమిల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

'జనసేన సభ్యత్వంతో బీమా'

జంగారెడ్డిగూడెం: జనసేన సభ్యత్వంతో ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇంఛార్జి మేక ఈశ్వరయ్య తెలిపారు. ఆదివారం జనసేన సభ్యత్వ కిట్స్ పంపిణీ కార్యక్రమం మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం చింతలపూడి నియోజకవర్గం వారీగా 3,365 మంది సభ్యులు చేర్పించామని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ప్రమాద భీమా ఉంటుందనీ, ఏదేని ప్రమాదం జరిగితే రూ.5 లక్షల నష్ట పరిహారం ఆ కుటుంబ సభ్యులకు అందజేయుట జరుగుతుందన్నారు. దీనిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తల కోసం ఏర్పాటు చేశారనీ తెలిపారు. సభ్యత్వం చేరిన ప్రతి కార్యకర్తకు ఇంఛార్జి మేకా ఈశ్వరయ్య ధన్యవాదాలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి

నూజివీడు రూరల్: మండలంలోని సుంకొల్లు గ్రామ అటవీ ప్రాంతంలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా తయారు చేసే స్తావరంపై ఆదివారం పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రెండు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

11 మంది అరెస్టు : రూ.70 వేలు స్వాధీనం

మండవల్లి: రాజకీయ బలంతో నివాసాన్ని పేకాటకు అడ్డాగా చేసుకుని నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మండవల్లి పోలీసులు మెరుపు దాడి చేశారు. నిర్వహణాదారుడు ఏర్పాటు చేసుకున్న రక్షణ వలయాలను దాటుకుంటూ వెళ్లి పేకాట ఆడుతున్న వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగాలలో కాలువ గట్టుపై ఉన్న నివాసంలో గుట్టు చప్పుడు కాకుండా నిత్యం పేకాట నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం వచ్చిందన్నారు. అయితే నిర్వాహకుడు పేకాటను ఆడించేందుకు కట్టు దిట్టమైన ఏర్పాటు చేసుకుని మరి నిర్వహిస్తున్నాడని తెలిసిందని అన్నారు. పరహరి గోడకు సీసా పెంకులు అమర్చడంతో పాటు కుక్కలను కూడా పెంచుతున్నారని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం పక్కా ప్రణాళికతో రైడ్ చేసి పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకోవడం జరిగిందని అన్నారు. 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.70 వేల నగదును స్వాధీనపరచుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. గ్రామాలలో, నివాసాలలో పేకాట, కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసే విధంగా పోలీసులు ప్రజలకు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తెల్లప్రోలు సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలప్రోలు ఎస్‌సి కాలనీకి చెందిన కాటం ఫ్రాన్సిస్(60) ఆదివారం తేల్లప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేగేటు వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనటంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రోడ్డేయండి మహాప్రభో..!

వైఎస్ఆర్ కాలనీ వాసుల ఆవేదన

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

బురద మయంగా రోడ్డు

ప్రజాశక్తి - చింతలపూడి

ఇదేదో వరద ముంపు గ్రామం కాదు, భద్రాచలం ముంపు ప్రాంతం కానే కాదు.. పోలవరం ముంపు ప్రాంతానికి సంబంధించినది అసలే కాదు.. మెట్టప్రాంతంలో చింతలపూడిలో ఉన్న వైఎస్ఆర్ కాలనీ పరిస్థితి ఇది..

సరైనా రోడ్లు, డ్రెయినేజీలు, వసతులు లేక అక్కడ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్డైనా వేయమని ఎన్నిస్లారు అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పందనలో చాలా సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకొనే నాథుడే లేడు..

చింతలపూడి పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో మొత్తం ఇళ్లు 220, జనాభా 700, ఓటర్లు 340 మంది ఉన్నారు. సుమారుగా 17 సంవత్సరాలుగా రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇక్కడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే మోకాళ్ల లోతు వరకూ నీరు రావటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే చాలు కొంతమంది ఇళ్లల్లోకి వరద నీరు చేరి సామాన్లు అన్నీ తడిసిపోయి, తలదాచుకోవడానికి లేక నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లు కావాలని ఆ కాలనీ వాసులు చేయని ప్రయత్నమూ లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా తమ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో రోడ్లు వేయకపోతే చంటిబిడ్డలతో సహ రోడ్డుపైకి వచ్చి ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

వర్షపు నీరుతో కాలువలను తలపిస్తున్న కాలనీ రోడ్లు

ప్రభుత్వాధికారులు స్పందించాలి..

తోర్లపాటి బాబు, సిపిఐ పార్టీ, చింతలపూడి

వైఎస్ఆర్ కాలనీ వాసులు రోడ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు పట్టించుకొని రోడ్డు వేయాలని కోరుకుంటున్నాం.

ఆదేశాలు జారీ చేశాం..

ఆదర్శ రాజేంద్రన్
సబ్ కలెక్టర్, చింతలపూడి స్పెషల్ అధికారి

వైఎస్ఆర్ కాలనీ రోడ్డుకి ప్రణాళికలు సిద్ధం చేయమని ఆదేశాలు జారి చేశాం. కొద్దిరోజులలో రోడ్డు వేయటానికి ప్రయత్నం చేస్తాం. గత వారం రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటన చేస్తున్నాం.

మాకు రోడ్డు అత్యవసరం..

తుము నరేష్, కాలనీ వాసి

వైఎస్ఆర్ కాలనీలో రోడ్డు వేయాలని అనేక సార్లు అందరికీ మొరపెట్టుకున్నాం. ఏఒక్కరూ స్పందించటం లేదు. రోడ్డు లేక వర్షం వస్తే కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నాం. మాకు రోడ్డు అనేది అత్యవసరం. అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరుకుంటున్నాం.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి ఇవ్వాల్సిన వేతనాలు, ఏరియాస్ బకాయిలో మిగిలిన బ్యాలెన్స్‌ను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఓ ప్రకటనలో కోరారు. ఏప్రిల్, మే మాసాల్లో నగర పాలక సంస్థ పన్నులు వసూలు చేసిన తర్వాత వేతనాలు ఏరియర్స్ చెల్లిస్తామని గతంలో కమిషనర్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చి ఉన్నారు. జులై మాసం పూర్తి కావస్తుంది, విద్యాసంస్థలు ప్రారంభమైయ్యాయి. పిల్లలకు ఫీజులు, పుస్తకాలు ఖర్చు ఉండటం వల్ల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. కమిషనర్, యూనియన్ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు ఏరియాస్ బకాయిలో మిగిలిన బ్యాలెన్స్ ఉద్యోగ సిబ్బందికి తక్షణమే చెల్లించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామ పంచాయతీల ఉద్యోగ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న ఒక నెల వేతనంను కూడా చెల్లించాలని కమిషనర్‌ను కోరారు.

రాష్ట్రంలోనే ఉత్తమ పాఠశాలగా ముసునూరు గురుకులం

ముసునూరు: పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం విజయం సాధిస్తూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే ఉన్నత శిఖరం అధిరోహించిన ముసునూరు గురుకుల బాలికల పాఠశాల రాష్ట్రంలోనే ఉత్తమ బాలికల గురుకుల పాఠశాలగా అందరి మన్ననలు పొందుతున్నదని ఆ పాఠశాల ప్రిన్స్‌పల్ యార్లగడ్డ శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల నుంచి పదో తరగతి ఫలితాలలో కరోనా సమయంలో కుడా నూటికి 98 శాతం విజయం సాధించరన్నారు. గురుకుల పాఠశాలలో ఉదయం వ్యాయామంతో మొదలై, మంచి భోజనాన్ని సిఎం జగన్ ప్రకటించిన మెనూ ప్రకారం అందిస్తున్నామన్నారు. సాయంత్రం క్రీడా పోటీలకు అర్హులైనా ఉపాధ్యాయులతో తర్ఫీదు ఇస్తూ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో ప్రతిభ కనబర్చిన అవార్డులు, రివార్డులు పొందడం జరుగుతుందని తెలిపారు.

తహశీల్దార్‌చే ఏటిగట్టు పరిశీలన

పోలవరం: వరదల నేపథ్యంలో మండలంలో పోలవరం నుంచి గూటాల వరకూ ఏటిగట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను తహశీల్దార్ బి.సుమతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.సుమతి మాట్లాడుతూ పోలవరం మండలంలో ఏటిగట్లు పటిష్టంగా ఉందని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు 2 వేల ఇసుక బస్తాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలవరం మండలంలో గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం నెక్లెస్ బండ్, ఎడ్లగూడెం ర్యాంపు, ఆంజనేయస్వామి గుడి ర్యాంపు, సిడబ్ల్యుసి ఆఫీస్ రాంపు, పోలవరం ప్రాజెక్టు చెక్‌ఫోస్ట్ రాంపులను పరిశీలించినట్లు తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రియేటివ్ ఆర్గానిక్స్ సంస్థ చేయూత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యార్థులను అభినందించిన కరాటం రాంబాబు

విద్యాభ్యాసంలో ప్రతిభ చూపిస్తున్న పలువురు విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన క్రియేటివ్ ఆర్గానిక్స్ సంస్థ ఆర్థికంగా చేయూతనిచ్చి, ఆ విద్యార్థుల లక్ష్య సాధనకు ఎంతగానో తోడ్పడుతుంది. గతంలో ఎంతోమంది మెరిట్ విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు అందించిన క్రియేటివ్ ఆర్గానిక్ సంస్థ తాజాగా ఆదివారం మరో ముగ్గురు విద్యార్థులకు నగదు సహాయాన్ని అందించింది. క్రియేటివ్ ఆర్గానిక్ సంస్థ అధినేతలు శీలంశెట్టి కృష్ణమోహన్, సౌభాగ్యవతి దంపతులు బుట్టాయగూడెంలో సౌభాగ్యవతి సోదరుడు, రైతు సంఘం నాయకుడు కరాటం వెంకటరెడ్డి నాయుడు చేతుల మీదుగా రూ.1.5 లక్షల నగదు సహాయాన్ని అందించారు. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ విద్యనభ్యసిస్తున్న వైద్య విద్యార్థిని పుప్పాల జ్యోతి నాయుడు(ద్వారకాతిరుమల)కు రూ.50 వేలు, హిమాచల్ ప్రదేశ్‌లో ఐఐటి చదువుతున్న విద్యార్థిని కోండ్రు షైనీ సలోమి(బుట్టాయగూడెం)కు రూ.50 వేలు, కాకినాడ కెఐటిలో బీటెక్ విద్యనభ్యసిస్తున్న గుండాల హేమంతలక్ష్మి (బుట్టాయగూడెం)కు రూ.50 వేలు నగదును విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సినీ నిర్మాత, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ డిసిసిబి ఛైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రతిభకు ప్రోత్సాహం తప్పకుండా లభిస్తుందని, అందిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని, లక్ష్యాలను సాధించాలని తెలిపారు. రైతుసంఘం నాయకుడు కరాట వెంకటరెడ్డి నాయుడు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులకు పేదరికం అడ్డంకి కాకూడదని, విద్యావంతులు, విజ్ఞానవంతులు సమాజానికి సంపద లాంటి వారిని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పుప్పాల మురళీధర్ రావు, బుచ్చిరత్నం, కోండ్రు కార్తీక్, సునీత, గుండాల సూరిబాబు, పోశమ్మ, గరికపాటి రవీంద్రబాబు, కరిమికొండ శివాజీ పాల్గొన్నారు.

ముంపులోనే వరి పొలాలు

ఇంజన్‌తో చేల్లో నీటిని బయటకు తోడుతూ..

ముదినేపల్లి: మండలంలో వరిపైరు ఇంకా ముంపులోనే ఉంది. ఎడతెరిపి లేకుండా ఐదు రోజులు పాటు కురిసిన కుండపోత వర్షానికి మండలంలోని అన్నీ గ్రామాల్లో వరి పైర్లు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. గత మూడు రోజులుగా వర్షాలు తగ్గినా డ్రెయిన్లు మాత్రం పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ముంపు ఇప్పటిలో తగ్గే అవకాశం లేదంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముదినేపల్లి మండలంలో వేలాది ఎకరాల్లో ఆకాల వర్షాలకు వరిపైరు ముంపుకు గురైంది. దీంతో అన్నదాతలు ఆవేదనకు గురైయ్యారు. ఇప్పటికే రెండుసార్లు విత్తనాలు వెదజల్లగా ప్రకృతి వైఫల్యాలు కారణంగా పంట నష్టపోయామన్నారు. గత మేలో విత్తనాలు వెదజల్లగా, ఎండలకు విత్తనాలు పొట్లుపోవడంతో, మళ్లీ రెండో దఫా వెదజల్లినట్లు కౌలు రైతులు చెబుతున్నారు. ఇంతలో ఆకాల వర్షం మళ్లీ పంటలను తుడుసుకుపెట్టుకు పోయిందని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా డ్రెయినేజీల నిర్వహణ సక్రమంగా లేకపోవడం కారణంగా తమ పొలాలు ముంపు భారిన పడ్డాయని రైతులు అంటున్నారు. ఆక్వాసాగు వల్లే వరి రైతులు భారీ వర్షాలకు ముంపుకు గురై పంటలు నష్టపోతున్నట్లు వరి రైతులు అంటున్నారు. కొందరు రైతులు పంటను కాపాడుకునేందుకు తమ చేల్లో ఉన్న వరద నీటిని ఆయిల్ ఇంజన్లతో పంట కాల్వలోకి తోడుతున్నారు. మండలంలోని పెయ్యేరు గ్రామంలో పలువురు రైతులు ఇంజన్లతో చేల్లో నీటిని డ్రెయిన్లలోకి తోడుకుంటూ పైరును రక్షించుకునే పన్నుల్లో పలువురు రైతులు నిమగ్నమయ్యారు. ఏగ్రామంలో చూసినా కంటి చూపు మేర చేల్లో ఎక్కడా పచ్చదనం అనేది కనపించడం లేదు. అంత సంద్రంలా తెల్లగా కనబడుతోంది.

పంట పొలాల్లో మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రస్తుతం సుమారు 4,820 ఎకరాలలో పంటలు నీట మునిగాయని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. పంట పొలాల్లో నీట మునగటానికి గల కారణాలు తెలుసుకొని, చర్యలు తీసుకొని, వివిధ శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. దీనికి గత 3 రోజుల నుంచి 8 మండలాలలో గ్రామ పంచాయతీ శాఖకి సంబంధించిన 4 మురుగు కాలువలను, ఇరిగేషన్ శాఖకి సంబంధించి 8 కాలువలను, ఎన్ఆర్ఈజిఎస్ శాఖకి సంబంధించిన వారితో 21 కాలువలను, మున్సిపల్ శాఖకి సంబంధించి 2 మురుగు కాలువలను, మొత్తం 36 మురుగు కాలువలు, కాలువలలో ఉన్న మురుగును జేసిబిలు, ప్రొక్లెయినీర్ల సహాయంతో వివిధ శాఖల సమన్వయంతో తొలగించారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ పనులు నిర్వహించడం ద్వారా ఇప్పటికీ 2,710 ఎకరాలులో ముంపునకు గురైన వరి పంటను ముంపు నుంచి తగ్గించడం జరిగిందన్నారు. అక్కడ కూడా పంట తేరుకొనే విధానం కనిపిస్తుందని, ఇది ఇలాగే రాబోయే రోజుల్లో కొనసాగిస్తూ, రైతులకు పూర్తి సహకారం అందిస్తూ పంటలను రక్షించాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించి తెలియజేయాలన్నారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి

మహాశక్తి సన్నాహక కార్యక్రమంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారి అభివృద్ధి కుంటుపడిందని, టిడిపితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని మాజీ ఎంపి మాగంటి బాబు అన్నారు. ఆదివారం మండలంలోని లక్కవరంలో టిడిపి మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన మహాశక్తి సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి మాగంటి బాబు మాట్లాడుతూ వైసిపి అసమర్థత వల్ల పోలవరం ప్రాజెక్టు అటకెక్కిందని విమర్శించారు. మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి అడిగితే అక్రమ కేసులతో ప్రతిపక్ష నేతలను, ప్రజలను హింసిస్తున్నారని తెలిపారు. అక్రమ అట్రాసిటీ కేసులతో రక్షణ చట్టాన్ని ఈ ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తరెడ్డి, మాజీ ఎంఎల్ఎ గంటా మురళి, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు, మండవ లక్ష్మణరావు లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జయవరపు శ్రీరామమూర్తి, గద్దె వెంకట సుబ్బారావు, బొబ్బర రాజ్ పాల్, కుక్కల మాధవరావు, గరిమెళ్ల చలపతిరావు, కొడవటి సత్తిరాజు, రావూరి కృష్ణ, పరిమి సత్తి పండు, పక్కాల వెంకటేశ్వరరావు, బొమ్మజి అనిల్, సొంగ రోషన్, ఆకుమర్తి రామారావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మహిళా సంక్షేమంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు యనమదల ఉషారాణి, ఏలూరు పార్లమెంట్ అంగన్‌వాడీ డ్వాక్రా కమిటీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొమ్మని విజయ అన్నారు. నూజివీడు పట్టణంలోని 14 వ వార్డు బాపు నగర్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలలో కనీసం సగం కూడా నెరవేర్చకుండా మహిళా సంక్షేమంలో జగన్ విఫలమయ్యారన్నారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానన్న జగన్ రెడ్డి వైన్ షాపులను రెట్టింపు చేసి, మద్యం అమ్మకాలు కొనసాగించాడన్నారు. పెన్షన్ రూ.3వేలు చేస్తానన్న జగన్ నేటికీ ఆ మాట నిలబెట్టుకోలేదన్నారు. చదువు కుంటున్న ప్రతి విద్యార్థికి అమ్మ ఒడి కింద రూ.15 వేలు మహిళల ఖాతాలో జమ చేస్తానన్న ఆయన ప్రతి సంవత్సరం లబ్ధిదారుల సంఖ్య తగ్గిస్తున్నారని విమర్శించారు. టిడిపి మహిళల ఆశీస్సులతో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, మరోమారు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడం, బిసిలకు రక్షణ చట్టం తేవడం, పేదలని సంపన్నులు చేసేలా కార్యక్రమాలను రూపొందిస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా నాయకురాలు గొల్లు దుర్గాదేవి, జయలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ అంగన్‌వాడీ డ్వాక్రా కమిటీ సభ్యురాలు సయ్యద్ నజీమా, వార్డ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ శివ లక్ష్మి, జయలక్ష్మి, ఉషారాణి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చిపాలెం పంచాయతీలో నియోజకవర్గం కన్వీనర్ బొరంగ శ్రీనివాసులు సూచన మేరకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం ప్రకటించిన మహాశక్తి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఇంటింటికి వెళ్లి మహాశక్తి కరపత్రాలు పంచి అందులో పథకాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సోంబాబు, ఏలూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యండ్రపగడ శ్రీనివాసరావు, రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం.నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి జారం చాందినీ విద్యాసాగరిక, ఏలూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు కుంజం సుభాషిని, ఉపాధ్యక్షురాలు పెండ్యాల రమాదేవి, యూనిట్ ఇంఛార్జి ఆలపాటి .పాణికిషోర్, ఏలూరు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం కన్నపరాజు, మండల బిసి సెల్ అధ్యక్షులు దెయ్యాల కృష్ణమోహన్, నియోజకవర్గం ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, మండల ఎస్‌టి సెల్ అధ్యక్షులు కొర్సా వెంకటేశ్వరరావు, పసుమర్తి భీమేశ్వరరావు, గన్నిన సూర్యచంద్ర, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేణుగోపాల్ మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లికి చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ఆపరేటర్ (ప్రభుత్వ ఉచిత బియ్యం సరఫరా వాహనం) బండారు వేణు గోపాల్(41) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వేణు గోపాల్ ఆగిరిపల్లిలో ప్రభుత్వ ఉచిత బియ్యం సరఫరా వాహన ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అందరికీ సుపరిచితుడు కావడంతో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ముంపు బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : జనసేన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇంఛార్జి మేక ఈశ్వరయ్య విమర్శించారు. ఆదివారం జనసేన రాష్ట్ర అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన ఆధ్వర్యంలో తాడువాయి గ్రామ పంచాయతీ శివారు చల్లావారిగూడెం పునరావాస కాలనీలో పోలవరం ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు సంబంధించిన కాలనీ ఇళ్లను జనసేన నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఈ సందర్భంగా మేక ఈశ్వరయ్య మాట్లాడుతూ కోయిదా, కట్కూరు, శ్రీరామపురం, తాట్కూరుగోమ్ము, వేలేరుపాడు ఎస్‌సి కాలనీలకు చెందిన కొంతమంది గిరిజనేతర కుటుంబాలను చల్లావారిగూడెంలో నిర్మించిన పునరావాస కాలనీకి తరలించామని తెలిపారు. వరదల కారణంతో నిర్వాసితులను తరలించిన ప్రభుత్వానికి కాలనీ ఇళు పూర్తిస్థాయిలో నిర్మించడం చేతకాలేదన్నారు. నిర్వాసితులు తమకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందలేదని అడుగుతుంటే అధికారులు సమాధానం చెప్పటం లేదన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపికి బుద్ధి చెప్పటం కాయమని మేకా ఈశ్వరయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గురుజు ఉమామహేశ్వరీ, కనకమహాలక్ష్మి, ఉమామహేశ్వరీ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

చింతలపూడి: విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించి, జిఒ నెం117ను రద్దు చేయాలని యస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో ఎం.హోటల్ వద్ద పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు యస్‌టియు అధ్వర్యంలో ఆత్మీయ అభినందనల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఆర్థిక పరమైనా బకాయిలు వేంటనే చెల్లించాలన్నారు. సిపియస్ రద్దు చేయాలని, పాత పెన్షను విధానం కొనసాగించాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో 102 మందికి చికిత్స

జంగారెడ్డిగూడెం: బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో 102 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారని అధ్యక్షులు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి డి.కేదారేశ్వర రెడ్డి, సంయుక్త కార్యదర్శి బి.సత్యనారాయణలు తెలిపారు. ఆదివారం స్థానిక సూర్య దంత వైద్యశాల నందు ఏర్పాటు చేసిన ఉచిత దంత పరీక్ష శిబిరంను కోరా నాగేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో దంత వైద్యులు డాక్టర్ శివరాం కుమార్, డాక్టర్ సురేఖలు వైద్య సేవలు అందించారు..

ప్రజల రాకపోకలు నియంత్రణ

ఏలూరు: కోమటిలంక గ్రామం వద్దనున్న నాగరాజు కోడు (పోలరాజు డ్రైన్) వద్ద కాజ్‌వేపై రాకపోకలు నియంత్రించి ప్రజలను అప్రమత్తం చేశామని ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్ తెలిపారు. వరద నీటి కారణంగా కాజ్‌వేపై ప్రమాదకర పరిస్థితిని నెలకొందని ఆదివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వెంటనే కాజ్ వేపై ప్రమాద పరిస్థితి తగ్గే వరకూ ప్రజల రాకపోకలు నియంత్రించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు.

మహారాజశ్రీ భీమవరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 260/2022
ఓ.ఎస్.నెం. 147/2020
పిటీషనరు /వాది:
యర్రంశెట్టి వీరాంజనేయులు
రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
1) కందుల రత్న కుమారి
2) కందుల సంధ్య
ఆర్డర్ 5 రూల్ 20 సి.పి.సి. ప్రకారం రెస్పాండెంట్లుకి నోటీసు
పై నెంబరు దావాలో 1,2 రెస్పాండెంట్లు /ప్రతివాదులుకి కోర్టు వారు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినా అమలు జరుగనందున **దీ. 07-08-2023 తేదీన పై కోర్టు వారు ఎదుట 10 గంటలకు హాజరు కావాలని, లేని పక్షంలో 1,2 రెస్పాండెంట్లు /ప్రతివాదులు పరోక్షంలో తీర్మానించబడునని తెలియచేయడమైనది.**
మోగంటి శివకృష్ణ
పిటీషనరు /వాది తరుపు అడ్వకేట్,
భీమవరం, భీమవరం.
31-7-2023. సెల్: 98485 39039

భీమవరం పురపాలక సంఘం
ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/డి.బి **తేది.28-07-2023**
భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్టు టెండరు నోటీసు నెం. 5(1-4) BHI/ జనరల్/ 2023-24/E1/E2** లోని జనరల్ ఫండ్స్ నుండి 4 పనులకు సంబంధించి రూ. 19.10 లక్షలకు గాను ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్. నెం. 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘం, ప॥గో॥జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.
సం/- **కమిషనరు**
భీమవరం పురపాలక సంఘం